


# దోపిడి

అరుణ నిష్ఠల

గడియారంలోని సెకన్స్ ముల్లు ఎవరో తరుముకొస్తున్నట్లు పరిగెడుతూంటే ఒక కన్ను దానివైపే ఉంచి గోడకున్న అద్దంలోకి చూస్తూ గబ గబ జడవేసుకుంటోంది రమ. బారెడు జడ వేసుకోవడం రోజూ ఆమెకి చిరాకే. స్టైవో రోజాలాగ బాబ్డ్ హెయిర్ చేయించుకుంటేనో ! హారతి వెలిగించి గంట మ్రోగించిన చప్పుడుకి ఉలిక్కిపడి తలతిప్పి చూసింది. గదికి ఆనుకుని ఉన్న వంటింట్లో తల్లి పూజ చేస్తోంది. తన ఆలోచనకి నవ్వుకొంది. సనాతనత్వం అణువణువునా మూర్తీభవించిన ఈ ఇంట్లో అలాంటి ధైర్యపుటాలోచన రావటం నిజంగా గొప్పే ! తల్లి వేంకటేశ్వరుడి ఫొటోతో పాటు అటు సాయిబాబాకు ఇటు రామకృష్ణ వివేకానంద ఫొటోలకి హారతి అతి శ్రద్ధగా ఇస్తోంది. "మీ ఆచారములను మీ పిల్లలకి నేర్పకండి కాలంతో పాటు మారండి" అంటూ వివేకానందుడి సూక్తులను జ్ఞప్తికి తెచ్చుకొని ఆచరించడం ఎక్కడ మొదలయింది ! ఇంకా ఆ ఫొటోలకి కుంకుమ పసుపు పూసి చందనం అద్ది ముఖం కనిపించకుండా పూల మాలలు వేసి ఆ పూలుమసిపారేలాహారతులు ఇస్తూంటేనే టైము చాలటం లేదు ! వయసు వస్తున్న కొద్దీ అనుభవంతో జ్ఞానం వస్తుందంటారు. ఆ జ్ఞానం ఉపయోగిస్తే చిన్నవాళ్ళ దగ్గర చులకన

అవుతామన్న భయమో లేదా రిజిడిటీయో ఏమో తెలియదు గానీ పెద్దవాళ్ళు చిన్నవాళ్ళలా మార్పును అంగీకరించరు. ఇంకా చెప్పాలంటే అంగీకరించలేరు. సజావుగా సాగిపోయే మార్గం లోంచి బయటపడి కొత్తదారి వెతకవచ్చు అని వారి ఊహకి రానివ్వరు. సెక్యూరిటీ ! నలుగురితో పాటు నారాయణ ! రమ మనసులోనే తల్లిని విసుక్కుంది. పూర్వపు ఒరవడి ప్రకారం తనకి పెళ్లి సంబంధాలు చూస్తోంది. మూడేళ్ళుగా ఇవాళ వచ్చే పెళ్ళివారు మాత్రం సామాన్యులు కారు !

ఆలోచిస్తూనే హేండ్‌బాగ్ తీసుకొని టిఫెన్ బాక్స్ బస్‌పాస్ పెట్టుకొని ఇంకా వంగి, దేవుడికి దణ్ణం పెడుతున్న తల్లికి వినపడేలా 'వెళ్తున్నా' అని కేకపెట్టి బయటపడింది. రమ నెలకి నిఖార్సుగా రెండు వేల రూపాయలు తెచ్చే పర్మనెంట్ ఉద్యోగస్తురాలు.

"గత మూడేళ్ళుగా సంబంధాలు కుదరకపోవటానికి కారణం ఘటన ఉండాలి అని సర్ది చెప్పుకుంటుంది. తనకి తనే ధైర్యం చెప్పుకుంటున్నట్లు. కానీ అసలు కారణం తన నల్లటి శరీరచ్ఛాయ అని తనకి బాగా తెలుసు. ఏది లేదో దానికి వెంపర్లాడడం మానవ సహజం."

బస్‌లో కూర్చుని చూస్తుంటే గుడిలో ఎవరో గంటలు మ్రోగించటం చూస్తే తల్లి జ్ఞాపకం వచ్చింది. ఇవాళ స్పెషల్‌గా అంత భక్తిగా పూజ ఎందుకో తనకి బాగా తెలుసు. లేదు శనివారం అని అమ్మ సమర్థించు కుంటుంది. అలాగే ఇవాళ పర్మిషన్ పెట్టుకొని మూడింటికే ఇల్లు చేరాలి. పెళ్ళివారు తనని చూడటానికి వస్తారు ! గత మూడేళ్ళుగా సంబంధాలు కుదరకపోవటానికి కారణం ఘటన ఉండాలి. అని సర్దిచెప్పుకుంటుంది. తనకి తనే ధైర్యం చెప్పుకుంటున్నట్లు. కానీ అసలు కారణం తన నల్లటి శరీరచ్ఛాయ అని తనకి బాగా తెలుసు. ఏది లేదో దానికి వెంపర్లాడడం మానవ సహజం. అలాగే యూరోపియన్ల ఛాయ ఉండాలి పెళ్ళికూతుర్లకి అనుకుంటారు మగపెళ్లివారు.

మనం నివసించే ఏరియా జాగ్రఫికల్‌గా ఎక్కడ ఉన్నదీ, ఆ వాతావరణం ఏమిటీ, దాని అనుగుణంగా కనుపాపల రంగు కళ్ళ ఆకారము, జుట్టు శరీరచ్ఛాయ, వాతావరణంలో తేమ, నాసిక ఏ విధంగా మానవులకి అమరుతున్నదీ వారికి అనవసరం. ఇవి ఇలా ఉండగా మనిషి సంపాదించుకున్న కష్టాలలో డబ్బు. అది సరిగా అమరాలి ముందస్తుగా. ఈసారి పెళ్లివారికి కట్నం అఖ్ఖరలేదుట. ఏవో లాంచనాలు చాలుట పిచ్చి అమ్మ సంబర పడిపోతోంది. ఆ రాయితీ ఎందుకూ అంటే పెళ్ళికొడుక్కి వయసు దాటిపోయింది గానీ సరైన ఉద్యోగం దొరకలేదు. టెంపరరీగా ఎక్కడో చేస్తున్నాడంటే అమ్మ పైకి ఒప్పుకోదు. వాళ్ళు చాలా సత్సంప్రదాయ కుటుంబానికి చెందినవారు శాస్త్రిగారికి బాగా ఎరుగున్న వారు అంటూ వాళ్ళకి దేవతల పక్క సీటు ఇచ్చేసింది. పెళ్ళి వారి గురించి ఆలోచన రాగానే సాయంత్రం కార్యక్రమం గురించి బాగా ఆలోచించుకుంది రమ.

★ ★ ★

"అల్లరి చేయకుండా మొన్న పండగకి కొన్న చీర కట్టుకోవే" జడ అల్లుతూ తనమాట వింటుందా అన్నా సందేహంతోనే పదోసారి చెప్పింది సావిత్రమ్మ, కూతురితో. పండుగకి వద్దంటున్నా వేయి రూపాయిలు పెట్టి మైసూర్ సిల్క్ క్రీమ్ కలర్ దాన్నిండా పింక్ పూవులున్న చీరకొంది సావిత్రమ్మ. అసలు ఈ సందర్భం కోసమేనన్న సంగతి రమకి తెలియదు. ఆడ పిల్లలు అలంకరించుకొని అందంగా అత్తవారికి కనపించాలి ? అసలు సహజత్వం ఎందుకు పోగొట్టుకుంటున్నారో పెద్దవాళ్ళు ? ఎరువు తెచ్చిన నగలు, పట్టుచీర, నలుపు కనిపించ నీయకుండా పౌడరు మేకప్ వేసుకొని రాంప్ మోడల్ అందరి ఎదురుగుండా ప్రదర్శనకి వచ్చినట్లు పెళ్ళి చూపులకి రావడం కూర్చోడం తన మాట తన అభిప్రాయం తన వ్యక్తిత్వం అన్నీ మరచిపోయి వాళ్ళు తనని కరుణిస్తారా ?, కట్నం తగ్గిస్తారా అని ఎదురు చూస్తూ కూర్చోవడం ! ఓ ! గాడ్ ! రమ చిన్నగా తల కొట్టుకుంది అప్రయత్నంగా ! రోజా అలా అలంకరించుకోలేరు కోడళ్ళు ! వారి నిజస్వరూపం చూసి మామూలుగా ఉంది అంటారు ! "శుభమా అని పెళ్ళి చూపులకి వస్తుంటే అలా నుదురు కొట్టుకుంటావేమిటే" గట్టిగా మందలించింది సావిత్రమ్మ. ఆమె కంఠంలో ధ్వనించిన మూఢనమ్మకానికి ఫక్కుమని నవ్వుతూ లేచి అలసిపోయినట్లున్న కళ్ళని చల్లని కుండలో నీళ్ళతో కడుక్కుంది. రెండు గదులు చిన్నవంటిల్లు ఆ ఇంట్లో

★ భర్త నీచుడైతే ఆ సంగతి గుర్తించని స్త్రీ అంతకన్నా నీచురాలు. నీచత్వం కనిపెట్టి తన భర్తని ఆ నీచత్వంలోంచి తప్పించడానికి ప్రయత్నించని స్త్రీ వ్యర్థురాలు. ప్రయత్నించినా అతను మారకపోతే యింకా వాడికి లోబడే స్త్రీ వ్యభిచారి.

★ ఏ అధమ స్థితిలో నన్నా పురుషుడు తిరిగి తన జీవితాన్ని తట్టుకో గలడు. కాని ఒకసారి నాశనమైతే స్త్రీ అంతటితో ఆఖరు.

– చలం

ముగ్గురు మనుషుల్నీ ఆప్యాయంగా చూసుకుంటాయి. మధ్యతరగతి తండ్రి మరణించగా వచ్చే పెన్షన్ రమ జీతము వాళ్ళకి ఆధారం. ఇస్త్రీ చేసిన తెల్లటి కాటన్ పంజాబీ డ్రెస్ టై ఎన్‌డైచేసిన రంగు రంగుల తెల్లని చున్నీ వేసుకుంటూ కాటుక పెట్టిన కళ్ళు ఎందుకో తళ్ళుక్కుమన్నట్లయి పాతికేళ్ళ తన ప్రతిబింబాన్ని చిరునవ్వుతో చూసుకుంది రమ. భుజం దాకా కనిపిస్తున్నా ఆ అద్దం రమ పూర్తి అందాన్ని ఎపుడూ చూపలేదు. పొడుగుకి తగిన ఒళ్ళు, బ్లెమిష్ లేని చర్మంతో ఆరోగ్యంగా శుభ్రంగా ఉండే రమ నవ్వితే ముత్యాలు పేర్చినట్లున్న పలువరుస బుగ్గల పడే చిన్న సొట్టలు ఎంతో ఆకర్షణ బాహ్యంగా మానసికంగా కరుణామయి. ఎదుటివాళ్ళకి సహాయపడే తత్వం.

"నాకు లేదు. మీనాన్నకి లేదు. నలుపు. ఇద్దరం పచ్చని పసిమి ఛాయతో ఉండే వారం. నీకీ నలుపెలా వచ్చిందో" ఈ మూడేళ్ళనుండీ రోజుకొకసారైనా అనుకుంటుంది. అసలు తన పిల్ల నల్లగా ఉన్నదని మొదటిసారి వచ్చిన పెళ్ళి వారు చెప్తేనే గుర్తించింది. ఈ నలుపెలా వచ్చిందో అంటూ రోజూ వాపోతూ ఉంటుంది జెనిటిక్స్ తెలియని సావిత్రమ్మ. చిన్న గదిలోకి తొంగి చూసింది "అనుకున్నాను. ఆ దిక్కుమాలిన బట్టలు వేసుకుంటావని. క్రిందటిసారి ఇవే ! అచ్చిరాలేదు ఈ బట్టలు అంటే వినవేం ? "కాస్త కోపంగా తెల్లని బట్టల్లో కూతురి నలుపు మరింత అధికంగా కనిపిస్తుందన్న భయంతో అంటున్న తల్లిని చూసి నవ్వి తిరిగి పుస్తకం చదువుకోసాగింది.

సావిత్రమ్మ విసుక్కుంటూ వంటింట్లోకి నడిచింది. కొంతలో కొంత నయం. దానిపేర మూడువందల గజాల స్థలం వాడి పేర ఇల్లు ఉంది. ఏదో గుట్టుగా ఆ స్థలం అమ్మితే డెబ్బైవేలు వస్తుందన్నారు శాస్త్రిగారు. ఎలాగోలా ఈ పెళ్ళి కుదిరిపోతే అంతే చాలు. మురళిని కాలేజీకి సెలవుపెట్టి రమ్మంది ఆవిడ.

★ ★ ★

అయిదున్నర అవుతూంటే ఆర్భాటంగా టాక్సీలో దిగారు పెళ్ళివారు. పెళ్ళికొడుకుని చిన్న చిన్న కిటికీల నుంచి ఇరుగు పొరుగుల కొన్ని జతల కళ్ళు ఆత్రుతగా ఆసక్తిగాను చూసాయి. బాగా ఉన్నాడు - పెళ్ళికొడుకు అని తృప్తి పడ్డాక రమ అంటే వెంటనే జాలి వేసింది. కాస్తో కూస్తో ఛాయ ఉన్న ఈ పెళ్ళికొడుకుకి రమ నచ్చుతుందా అని అతి మామూలు మనస్తత్వం ఉన్న సంఘపు బుర్రతో ఆలోచించి ఏమో మనచేతులలో ఏం ఉంది అంతా విధి చేతుల్లో ఉంది అంటూ అందరిలాగే విధి ఇచ్చే తాత్కాలిక రక్షణ కవచం కప్పేసుకున్నారు.

ఇద్దరు అప్పచెల్లెళ్ళు వయసు మీరిన విధవమేనత్త, తల్లి పురోహితుడు శాస్త్రిగారు వచ్చారు. చక్రవర్తి సామంతు రాజ్యానికి వస్తే జరిగే ఏర్పాట్లనీ జరిగాయి. అరగంట సేపు నడిచిన ఆ వ్యాఖ్యానంలో విచిత్రంగా రమ నచ్చిందని పెళ్ళికొడుకు రిజల్టు ప్రకటించాడు. కట్నం ఏమిటి ఛీ ! ఏవో లాంఛనాలు చాలు. పానకం బిందెలు, వెండిచెంబు, వెండి కంచం, ఉంగరం, స్కూటరు అప్పగింతల బట్టలు అనే మాటలు అక్కడ భరతనాట్యం చేస్తున్నాయి. శాస్త్రిగారి నట్టువాంగం. "ఆనక ముసుగులో గుద్దులాట లేమిటి? హాయిగా ఎదురుగానే మాట్లాడేద్దాం" అన్న వియ్యపురాలి మాటలు విని సావిత్రమ్మకి మతిపోయింది. పిల్ల నచ్చిందన్న దానికి సంబరమో వాళ్ళు వల్లించిన పట్టిక ఖరీదు నోటితో వెంటనే లెక్కలు వేయలేని తన అశక్తతకు విచారమో ఈ పెళ్ళి ఒక్కర్తినీ నిర్వహించగలనా అన్న భయమో తెలియని అయోమయంలో పడిపోయింది ఆవిడ. ఆ సందట్లో రమని చిన్న గదిలోకి పిల్చి "ఎలా ఉన్నాడే పెళ్ళికొడుకు" అని అడగటం మరచిపోయింది. అసలు ఆడపిల్లకి సొంత అభిప్రాయాలు ఉండటమేమిటి? పెద్దవాళ్ళు ఉన్నది ఎందుకు ? అన్ని విధాలా బాగుంటేనే కదా పెళ్ళి సంబంధం చూసేది" అన్న అభిప్రాయం ఆవిడది. ఆవిడ ఎపుడూ సొంతంగా ఆలోచించలేదు. చుట్టూ ఉన్న సమాజం నుంచే ఆమె చూసి నేర్చుకుంది.

ఉరమని పిడుగులా శాస్త్రిగారిని ఉద్దేశించి రమ అంది "ఉండండి మావయ్యగారు" అని, అసలు పెళ్ళికూతురి ఉనికిని పెళ్ళికొడుకు ఆమె నచ్చిందని బాహాటంగా చెప్పడంతో అందరూ అపుడే మర్చిపోయారు.' అక్కడే సాయానికి వచ్చిన పక్కింటి అన్నపూర్ణ, కాంతమ్మగారు సావిత్రమ్మను రమను కళ్ళతో అభినందించి అదృష్టవంతుల్లా చిత్రీకరించేసారు. పెళ్ళికొడుకి స్థాయి దేవుడితో సమానం అయిపోయింది ఆ వాతావరణంలో. శాస్త్రిగారు అబ్బాయి ఎంత మంచివాడో చెబుతున్నారు గానీ ఎవరూ అబ్బాయి కున్న అప్పుల సంగతి చెప్పటం లేదు ఎరుగున్న వాళ్ళెవరు. అబ్బాయి ఛెయిన్ స్మోకింగ్ సంగతి అసలే ఎత్తటం లేదు. ఆ సందర్భంలో ఆశుభ ఘడియల్లో ప్రపంచంలో కెల్లా అదృష్టవంతురాలు అని అనబడుతున్న రమ గొంతుక అపశృతిలా వినిపించింది శాస్త్రిగారికి. షాక్ తగిలినట్లు ఆగిపోయారు. తనకి వచ్చిన ఈ అపూర్వమైన అవకాశాన్ని మూడేళ్ళుగా తల్లిపడిన శ్రమ ఫలితాన్ని ఆకాశానికి ఎత్తేస్తూ భగవంతుడికి అనేక నమస్కారాలు చేస్తూ కూర్చోవలసిన ఈ పిల్ల ఇంతమందిలో నోరు విప్పడమా ? అందరి అంచనాలనీ తలక్రిందులు చేస్తూ పెళ్ళికొడుకు వైపు చూస్తూ రమ అంది.

"చూడండి వెంకట్రావుగారూ ! నేను

★ స్త్రీ పురుషులు మారిపోవడమే నిజమైతే ఆ దాంపత్యం నించి తప్పుకోవడం చాలా ముఖ్యమైన ధర్మం. కాని విడిపోక ఒకరి ప్రాణాలు ఒకరు కొరుక్కుతినడం ఎవరికీ సౌఖ్యమివ్వని మూర్ఖం. తమ గోడులవల్లనన్నా, చుట్టుపక్కలవాళ్ళ బోధనల వల్లనన్నా మనుషులు మారి బాగుపడతారనుకోవడం గుడ్డితనం.

— చలం

నచ్చానని చెబుతున్నారు గదా ? నా గురించి ఏం తెలుసునని అలా చెబుతున్నారు? మీకు కనీసం నా బ్లడ్ గ్రూప్ కూడా తెలియదనుకుంటాను

ఉలిక్కిపడిన వెంకట్రావు అప్పచెల్లెళ్ళు మేనత్త అతి వింతగా రమని చూసారు. వెంకట్రావు తల్లి ఏ విధంగా అన్ని లాంచనాలు రాబట్టుకోవాలో ఏ విధంగా మాట్లాడితే సావిత్రమ్మ ఈ సంబంధం తప్పిపోతుందని హడలిపోతుందో ఏ విధంగా ఆడపిల్లల తల్లితండ్రులు తన కొడుకు కోసం క్యూ కట్టి నిలబడ్డారో తాము ఈ సంబంధం ఒప్పుకోవడం వల్ల నిజంగా లాభపడేది (రమ పర్మనెంట్ ఉద్యోగమూ జీతమూ వల్ల) తామే అయినా ఏ విధంగా నల్లని పిల్లని చేసుకుంటూ తమ ఉదారత్వం ప్రకటిస్తున్నామో చెబుదామని ఆలోచిస్తున్న ఆమె అదిరిపోయి చూసింది వెంకట్రావు తడబడిపోయాడు.

"పోనీ మీ పాయింట్ ఆఫ్ వ్యూలో చూస్తాను. అసలింతకీ ఈ పెళ్ళికి ఎంతవరకూ తయారుగా ఉన్నారు? పెళ్ళి సింపుల్‌గా రిజిస్టర్డ్ కావడం మీకు సమ్మతమేనా ? నా మటుకు నేను మా నాన్నగారు నా కోసం కొన్న స్థలంలో సగం అమ్మేసి ముప్పై అయిదువేలు, బాంకిలో వున్న అయిదు వేలు కాక పదివేలు లోను తేగలను. ఈ యాభైవేల తోటి ఇంటికి కావలసిన పరికరాలు కొని ఒక పాతికవేలు ఎఫ్.డి.లేక మరే విధంగానైనా ఇన్‌వెస్ట్ చేస్తాను. మీరు మీపరంగా ఏం చేయగలరు? ఎంత డబ్బు మీ చేతిలో ఉంది ? అది ఏ విధంగా ఖర్చు చేయగలరు? ఏమైన ఒడుదుడుకులు వస్తే ...."

గబ గబ అడుగుతున్న రమ ప్రశ్నలకు సావిత్రమ్మకి పోయిన మతి తిరిగి వచ్చింది. "రమా ! నీకేమైనా మతిపోయిందా ?" అంటూ గట్టిగా అరచిన తల్లి అరుపుకి అటువైపు చూసింది.

నోరు వెళ్ళబెట్టి ఉండిపోయిన వెంకట్రావును తల్లినిప్పులు కక్కుతున్న కళ్ళతో చూసింది.

"లేవరా" అని హూంకరించింది ఆవిడ. రోబోట్‌లా లేచినిలబడ్డాడు వెంకట్రావు.

"ఆగండమ్మా ఒదినగారూ ! చిన్నది. ఏదో తెలియక వాగింది. మాట కరుకుగాని మనసు వెన్నలాంటిది" సావిత్రమ్మ ఆవిడ కాళ్ళు ప్రాక్టికల్‌గా పట్టుకోలేదు అంతే.

ఎర్రగా అయిపోయిన ముఖంతో "ఇంకేం మాట్లాడక్కరలేదు పోనీ కదా అని నలుపైనా కట్నం అక్కరలేదనుకుంటే ... ఇంత పొగరుబోతు పిల్లను ఎవరూ చేసుకోరు". అవమానం జరిగినట్లు భావించిన ఆవిడ అప్పుడే గడపదాటేసింది. ఆవిడ పరివారం అనుసరించింది.

శాస్త్రిగారు చిరాగ్గా రమను చూస్తూ "నాముఖాన్న ఈ రెండు మాటలు ముందే చెబితే మీకు సంబంధాలు తెచ్చేవాడిని కాదు. ఏదో రమ తండ్రికీనాకూఎక్కడో మిగిలిపోయిన స్నేహానికి మంచికిపోతే మంచి శాస్తి చేసారు తల్లీ" అంటూ సావిత్రమ్మతో అంటూ కండువాతో ముఖం తుడుచుకుంటూ వెళ్ళిపోయారు.

వాళ్ళు తిన్న టిఫెను ప్లేట్లు కాఫీ గ్లాసులు ఆ ప్రదేశంలో పరచిన జంబుఖానాలా మధ్య వయసులో ఉండగా సావిత్రమ్మ అల్లిన లేసు టేబిల్‌క్లాత్‌మీద వికృతంగా కనిపిస్తున్నాయి. అరచి కేకలేసి ఏడ్చి "నీకీ జన్మలో పెళ్ళికాదు. నువ్వు నా కూతురివి కావు. శని గ్రహంలా నా కడుపున దాపురించావు. నేను నీకేం అన్యాయం చేసాను? నన్నెందుకిలా సాధిస్తున్నావు", అంటూ తిట్టి సొమ్మసిల్లి పోయింది. అన్నపూర్ణ కాంతమ్మగారూ ఆవిడని ఓదార్చి రమని ఓ పురుగుని చూసినట్లు చూసి వెళ్ళిపోయారు. అక్క ఇలా అందరి ముందూ కాక నెమ్మదిగా ఒక్కర్నీ కలుసుకొని మాట్లాడి ఉంటే బాగుండి పోనేమో అని మనసులో అను కున్నాడు.

★ ★ ★

"ఊ ! అయితే నీప్లాను ఫ్లాప్ అయిపోయిందా" శాంతి రమని అడిగింది లంచ్ అవర్‌లో.

"లేదు. సక్సెస్ అయింది". టిఫెను బాక్స్ తీస్తూ అంది రమ. శాంతి తలెత్తి చూసిన చూపుకి నవ్వుతూ" అలా ఆశ్చర్యంగా చూడకు. కన్వెంషనల్‌గా పాత సంప్రదాయ పద్ధతి ప్రకారం ఆలోచించే అమ్మకి మూడేళ్ళ నుంచీ నచ్చచెప్పటానికి ప్రయత్నించాను. ఫలితం లేకపోయింది. ఆమె వినదు. ఆమె మనస్సు ఎలా చెప్పినా బాధపడుతుంది కనుక ఈ విధంగా చెప్పాను. ఇంక నాగరికత మనం తెచ్చిపెట్టుకున్నామని గర్వించే ఆడపిల్లలు ఇంకా తమ పెళ్ళి ఎవరో చేయాలని ఎదురు చూస్తూ కూర్చోవడం అనాగరికం కాదూ ? నేను ఇరవై అయిదవ ఏట పెళ్ళి చేసుకుంటానని అమ్మకి ఎప్పట్నించి చెప్తున్నానో తెలుసా ? వినందే ! ఈ పెళ్ళి చూపులంటేనే అసహ్యం నాకు. అరగంటలో జీవితంమొత్తాన్ని నిర్ణయించుకునే అమాయకులనునేను అంటగట్టుకోలేను. పెళ్ళి సింపుల్‌గా చేసుకుని అనవసరపు ఖర్చులు లేకుండా సంసారానికి డబ్బు పునాది వేసుకోలేని దద్దమ్మలని చూస్తే నాకు ఒళ్ళు మంట. నాతోపాటుగా నా ఆలోచనల వేవ్‌లెన్త్‌కు సరిపోయే ఆలోచనలు గల నా జీవిత భాగస్వామిని నేను ఎన్ను కుంటాను

నెమ్మదిగా దృఢంగా మాట్లాడుతున్న రమ మాటలు ఆ పక్కకి కొంచెం వారనున్న

★ స్త్రీ దిక్కు లేక, చాతకాక, ధైర్యం లేక మొగాడి మీద ఆధారపడ్డన్నాళ్ళు యింతే. కూలిచేసుకుని తన పొట్ట పోసుకునే ఆడది ఈ నాగరికులకంటే, గ్రాడ్యుయేట్లయి మొగుళ్ళని వెతుక్కునే స్త్రీల కంటే, చాలా నయం. పెళ్ళి లేకపోతే ఆడదానికి గతిలేదన్నన్నాళ్ళూ యేం చేసినా వొకటే !

– చలం

శివరాంకి వినిపిస్తున్నాయి. తన వంతు తను వివాహ జీవితంలో ఏమి చేస్తుందో చెప్పుకుంటున్న రమ మాటలు వింటూ ఒక నిర్ణయానికి వచ్చాడు.

నాలుగైదు రోజుల. తరువాత ఆఫీసు కాంటీన్‌లో శివరాం రమ కూర్చొని చాలాసేపే మాట్లాడుకున్నారు. రమ ఆలోచిస్తోంది. శివరాంకు ఆ మధ్య శాంతితో మాట్లాడుకున్న మాటలు వినిపించాయని ఆమె అభిప్రాయాలన్నీ నచ్చాయనీ, మీరు బాగా ఆలోచించుకునే ఒక నిర్ణయానికి రండి రమ. గత మూడేళ్ళుగా నన్ను దగ్గరగా రోజుకు 8 గంటలపాటు గమనిస్తూనే వున్నారు. నా జీతం ఉద్యోగం అన్నీ తెలుసు. తొందర ఏం లేదు. మీ ఇష్టం ఏదాది రెండేళ్ళు కానివ్వండి" అని అన్నాడు.

సాటి ఉద్యోగస్థుడు అతని ప్రవర్తనలో ఏ లోపం ఆమెకి కనపడలేదు. ఇపుడు భర్తగా ఊహించుకుంటే ఫర్వాలేదనిపిస్తోంది. తల్లి రిటైర్ అయి ప్రయివేటుగా ఏదో పనిచేస్తున్న తండ్రి ఇద్దరు తమ్ముళ్ళు ఒక పెళ్ళి కావలసిన చెల్లెలు ఉన్నారు.

శివరాంగారూ జీవితం అంటే భగవంతుడు ప్రసాదించిన వరం అని నా అభిప్రాయం మన దేశంలో అత్తవారికి కోడలంటే సద్భావం లేదు. జనరల్‌గా చెబుతున్నాను. ఏం అనుకోకండి. ఆ తరువాత పోట్లాటలు విడిపోవడాలు మనస్పర్థలు ఇవన్నీ తలెత్తకుండా ముందే చూసుకుందాం. మీ తల్లిదండ్రులు మరీ ముసలివారు కారు కదా ? వారిని చూసుకునే అవసరం వచ్చినపుడు తప్పకుండా మనమే చూద్దాం మనింటికి రమ్మందాం. మీ డబ్బు వారికి ఎంత పెడతారు అన్నది నేను కల్పించుకోను. మనింటి అవసరాలు పోను మీ ఇష్టం." నిక్కచ్చిగా స్పష్టంగా చెబుతున్న రమను తన ఉలికిపాటు కప్పెట్టుకుంటూ చూస్తూ తలాడించాడు.

★ ★ ★

"అదేమిట్రా ప్రేమించాను విశాలిని తప్పు చేసుకొనన్నావు ఎవర్నీ ! మళ్ళీ ఇదేమిటి' 'బాటిల్ గ్లాసులోకి ఒంపుతూ అన్నాడు ప్రసాదు చిన్నప్పటి స్నేహితుడు.

"ప్రేమ గీమా కమిట్‌మెంట్ అదో పెద్ద జంజాటం గురూ ! జోగి జోగి రాసుకుంటే రాలేది బూడిద. విశాల అందమైన పిల్ల మెట్రిక్ బ్యూటీ ! ఇక్కడ రమ సంపాదిస్తోంది. నాలుగు డబ్బులు వెనకెయ్యగలిగే సత్తే ఉంది. వండిపెట్టి ఫామిలీ చూసే టైపు. మరీ చదువుకుంటే ప్రాబ్లెమ్ కదా ! ఈ నాలుగేళ్ళు ఓర్చుకుంటే పిల్లో పిచికో పుట్టాక ఎక్కడికి పోతార్రా వీళ్ళు ? ఆల్ ఇన్ వన్ అవసరాలు తీర్చే యంత్రాలు ఈ ఆడవాళ్ళు. ఏదో ఆదర్శం అనే భ్రమలో ఉంది. ఉండనీ ! మన సొమ్మేం పోయింది? వేరే వెళ్ళిపోతానంటే అమ్మా వాళ్ళు ముందు ఏడ్చారనుకో. ఓరి వెర్రివాజమ్మల్లారా కొన్నాళ్ళపాటుకేనర్రా డబ్బు నెల నెలా ఇస్తూనే ఉంటాను. అనేప్పటికి ఊరుకున్నారు. పెళ్ళి అంటూ అయిందా భార్యలు చచ్చినట్టు సంసారం చూసుకుంటూ బాధ్యతలు మోస్తారు. ఎక్కడికి పోగలరు వీళ్ళు నడి సముద్రంలో నావ మీద పిట్టలు.

స్థలం ఉందిట నూట యాభై గజాలులో నెమ్మదిగా లోను తీయించి ఇల్లు కట్టిస్తాను రమ చేత. జీవితాంతం హాయిగా ఉండచ్చు. త్రాగుడు మత్తులో స్నేహితుడితో తన ఆలోచనలన్నీ బాహాటంగా చెప్పేస్తున్నాడు శివరాం.

★ ★ ★

ఆరు నెలల తరువాత సింపుల్‌గా రమ శివరాంల వివాహం జరిగింది. వేరే రెండు గదుల ఇల్లు తీసుకొని ప్రావిడెంటు ఫండు లోను తీసుకొని ఇంటికి కావలసిన సామాను కొన్నాడు శివరాం రమ కోరిక మేరకు.

"నేను చెప్పలేదురా ? నా తల్లి నల్లగా ఉన్నా శ్రీ మహాలక్ష్మి" మురళితో కొత్త ఇంటి గృహ ప్రవేశం నాడు తల్లి అంటుంటే రమకి తల్లిని చూస్తే జాలి వేసింది. ఇలాంటి వాళ్ళు తమంత తాము బ్రతకడానికి ప్రయత్నించరు. ఎలా బ్రతకాలో ఎలా మాట్లాడాలో ఎలా ప్రవర్తించాలో ప్రతీ క్షణం చెర్నాకోలతో సంఘం వీళ్ళని బెదిరిస్తూ హెచ్చరిస్తూనే ఉంటుంది. అలా బెదిరిపోయే గొర్రెలంటేనే సమాజానికి ఇష్టం ఆ గిరి గీసి అందులోనే బ్రతకమని ఆజ్ఞాపించే సంఘం ఎదురుతిరిగే రమ లాంటి వాళ్ళను సహించలేదు. మొండిగా ఉండేవాళ్ళని చూసి లోపల భయం ఉన్నా అది ప్రకటించ కుండా వెలివేసినట్లుగా గానీ పట్టించుకోనట్లుగా గానీ చూస్తుంది. ఇంటినిండా అమర్చిన కొత్త వస్తువులు చూసి సంబరపడి పోతూ "నా రమ తెలివైనది మామూలుగా పెళ్ళి తను చేస్తే ఇన్ని వస్తువులు అమిరేవా ?" అన్న ఆలోచన మెరుపులా ఆవిడ మనసులో మెరసి మాయమైంది. ఆర్భాటంగా తను తెచ్చిన జరీచీరలు పేంటు షర్టు గుడ్డలు అల్లుడికి అందరికీ అమర్చటంలో లీనమైంది.

★ ★ ★

జీవితాలని శాసించే వాటిల్లో డబ్బు ముఖ్యమైనది అని డబ్బు వెనకేసుకొని పెళ్ళి అంటే జీవిత భాగస్వాములు ఒకమాట మీద నడిస్తే చాలు అని భావించిన రమ అయిదేళ్ళలో చాలా అనుభవాలే పొందింది. నెమ్మదిగా చీటీలు కట్టి మాటల నేర్పుతో చెల్లెలు పెళ్ళి జరిపించాడు. సంఘంలో మంచి అన్నగా పేరు అడపాదడపా పరీక్షల నెపంతో ఇంట చదువు కునే మరుదులకి చేసి పెట్టేది రమ. వాళ్ళకి

★ ఇంకో హృదయం తనకోసం కొక్కై పడుతోందంటే స్వయంగా యిష్టం లేకపోయినా స్త్రీ హృదయం సంతోషించ కుండా వుండడం సృష్టికే విరుద్ధం. సుస్వభావులు జాలిపడి తీరతారు. దుర్మార్గులు అదే వీలని స్వార్థాన్ని సాధించుకుంటారు.

★ ధనమూ, మానమూ, అందమూ, మర్యాదలేని స్త్రీ జల ప్రవాహము మధ్య తృణము. ఏదారిన పొయ్యేవాడి అనుగ్రహానికీ దోసిలి వొగ్గవలసిందే.


– చలం

## చోళులున్న చోట పల్లవులా !

ఆత్రేయ వున్న చోట నవ్వులు పూస్తాయి. ఓ చిత్రానికి ఆయన చేత ఓ పాట రాయించాలని ఓ దర్శకుడు మద్రాసులోనే అతి ఖరీదైన 'చోళ' హోటల్లో ఓ గదిలో బంధించారు. రోజులు గడిచిపోతున్నాయి తప్ప పాటకి పల్లవి పుట్టడం లేదు. అప్పటికి రోజుకి 1500 చొప్పున ఆ హోటల్ గదికీ ఆత్రేయకీ 15 వేలు ఖర్చయి పోయాయి. ఒక పాటకి 15వేలు ఖర్చా ? అయినా, ఆత్రేయ కాబట్టి నిర్మాత ఏమీ అనలేకపోయాడు. కాని, వేరే హోటల్లో గది తీసుకుని ఆత్రేయని అక్కడ వుంచారు అంటే రోజుకి 1500 రూపాయల గది నుంచి 100 రూపాయల గదికి మార్చారు. ఆ రాత్రి ఆత్రేయ పాట రాసి ఇచ్చేశారు.

"ఈ పనేదో 'చోళా'లోనే చేస్తే బావుండేది కదా ?"అని దర్శకుడు అన్నాడు. ఆత్రేయ తాపీగా "చోళులున్న చోటకి పల్లవులు రారయ్యా?" అన్నారట.

★ ★ ★



ఉద్యోగాలు వచ్చి వెళ్ళారు. ఆస్పత్రి దగ్గరగా ఉంది ఒంట్లో బాగుండలేదు అంటూ అత్తమామలు చేరారు ఎప్పుడో! ఇంట బయట చాకిరీ ఎక్కువైంది. రమకి శివరాం ఏదో సహాయం చేస్తున్నట్లు కనపిస్తుంది కానీ చెప్పుకుందికి ఏ సహాయం లేదు. రెండేళ్ళ చంటిపిల్లతో అందమైన కళ్ళలో కళ తప్పి యాంత్రికత చోటు చేసుకుంది. రమ జీతంలో కోతలు ఎక్కువైనాయి. పెరుగుదలకంటే ఎక్కడ జీవితంలో తప్పటడుగు వేసిందో అర్థం కావటం లేదు. ఎక్కడో లోపం ఉంది. తను ఎంచుకున్నట్లు తన అభిప్రాయలకు తగినట్లుగా జీవితం ప్రారంభించింది.

పిల్ల ఏడవడంతో హడావిడి పడి లేచింది రమ. అయిదున్నర పొద్దున్నే పాలపేకట్లు తీసుకోవాలి. వంటవండి పిల్లని క్రెచ్‌లో దిగవిడచ్చాలి. చంటిపిల్లను చూసే ఓపికలేదని అత్తగారు ముందే ప్రకటించింది. ఆఫీసులో బోలెడంత పని ఉంది.

"రమా డియర్ పేస్ట్ పెట్టవా" మంచం మీద నించి లేస్తూనే శివరాం పెట్టిన కేకకి అటు చూసింది రమ.

మాటలు అమ్ముకొని తన అవసరాలు దగ్గరుండి తీర్చించుకునే శివరాంలో ఏదో లోటు ఉందని తెలుస్తోంది కానీ అది ఏమిటో తెలుసుకోలేకపోతోంది. బయట పడని శివరాం ఎప్పుడూ తన జాగ్రత్తలోనే ఉంటాడు కనుక జీవితం అంతా నటించే నేర్పు గల శివరాం రమకి ఎప్పుడూ దొరకడు. రమని తన అవసరాల సాలెగూడులో కదలకుండా బంధించి మంచి భర్త అనే పేరు సంపాదించాడు ఇరుగు పొరుగు మధ్య.

జీవితం అనే భవనానికి నిజాయితే పునాది అనే సంగతి రమ బాధ్యతల్లోంచి బయటపడి తెలుసుకొనే సరికి అప్పటికే చాలా ఆలస్యం అయిపోతుంది. అయితేనేం ? ఆ అపజయం ఆమె మనసుకి కొత్త శక్తిని ప్రసాదించి ఆ ఫెయిల్యూర్ నుంచి ఇంకొంచెం ఎదగడానికి, జీవితంలో జయం సాధించడానికి కావలసిన మనోధైర్యం ఆలోచన ప్రసాదించ వచ్చు.

✢

దేహాలు ఉపయోగించకుండా హృదయాలలో
ప్రేమ నిలుపుకోగల మనుషులు చాలా అరుదు

– చలం